కావాలో అడుగు. నాకు మాత్రం పని కావాలి!''.

క్లాడ మైలీ అతి కష్టమ్మీద మూడు భారీ ఫిరంగులను కొండమీదికి చేర్చాడు. నరసింహనాయుడు బురుజు మీంచి నిస్సహాయంగా గమనిస్తున్నాడు. జరగకూడనిది జరుగుతున్నది. తన సైనికులు ఎంత ప్రయత్నించినా ఆపలేకపోతున్నారు. ఆ తెల్లారి.. ఫిరంగి మోతలతో కోట పరిసరాలు దద్దరిల్లినయి. కోటలో కలవరం మొదలయింది.

మీర్ జుమ్లా కసిగా చూస్తున్నాడు. ఇంతకాలానికి కోటను వశపరుచుకొనే సమయం వచ్చిందని ధీమా! భీకరంగా వచ్చిపడే ఫిరంగి గుళ్ల తాకిడికి కోట బీటలు వారుతున్నది. ఏ క్షణంలోనైనా గోడ కూలి ఒక దగ్గర దారిస్తే చాలు.. శత్రువుపై భీకర దాడికి దిగడానికి రేచు కుక్కల్లా తన సైన్యం కాచుకుని ఉంది. ఆవల పక్క నరసింహనాయుడు హతాశుడై చూస్తున్నాడు.. కూలడానికి సిద్ధంగా ఉన్న గోడవంక. వెంటనే తన గుర్రాన్ని ముందుకురికించి పెద్దగొంతుతో దళపతులను హెచ్చరించాడు..

''కత్తులు, బరిసెలు పట్టండి. లోనికి వచ్చినవాణ్ని వచ్చినట్టు నరికెయ్యాలె! కోట తలుపులు తెరవనీకుండా అక్కడ కొంత సేన మోహరించండి. ఒక నాలుగువేల సైన్యం రాజమందిరాన్ని చుట్టుముట్టి కావలికాయాల.. పురుగైనా లోనికేగవద్దు!''.

'ఫటేల్'మనే చప్పుడుతో గుండు తాకి.. కోటగోడ విచ్చిపోయింది.

''జై రంగనాథా!'' అంటూ.. నరసింహుడు లోనికి వచ్చిన సైనికుణ్ని వచ్చినట్టు వేటువేస్తూ ముందుకు కదిలాడు. అతనికి బాసటగా ఒక పటాలమే ముందుకు కదిలి పోరుకు దిగింది. ఒకపక్క మరింతమంది శత్రుసైనికులు లోనికి చొచ్చుకువచ్చేందుకు శతధా ప్రయత్నిస్తున్నారు. మిడతల దండులను గుర్తుకుతెస్తున్నారు. ఇక సంకుల సమరం మొదలయింది. ఇరువైపులా వందల మంది నేలకొరుగుతున్నారు. నేల రక్తంతో తడిసింది. హాహాకారాలు మిన్నంటుతున్నవి.

* * *

భయపడవద్దంటూ ఒకపక్క తనవారిని హెచ్చరిస్తూ.. అంతటా తానై తిరుగుతున్నాడు నరసింహనాయుడు. హఠాత్తుగా వెనకనించి పడింది ఒక కత్తివేటు. కత్తి వాదర భుజాన్ని చీరేసింది. అలాగే గుర్రం మీది నించి కిందికిపడి నేలకొరిగాడు.

''శభాష్ నబీ!''.. వెనకనుంచి ఎవడో బిగ్గరగా అరిచినాడు.

''స్వామీ!'' అంటూ అంగరక్షకుడు పరుగున వెళ్లి


**మాయ మాటలు మాట్లాడుతూ పొదిలి లింగన్న చేతికి అందించిన విష పానీయం నమ్మికతో అందుకున్నాడు తిమ్మానాయుడు. మరోపక్క తన చేతిలో ఉంచిన ఫర్మానా చూసి నివ్వెరపోయి నాడు. గుత్తి దుర్గానికి బదులుగా ఒక చిన్న గ్రామం హనుమనగుత్తికి అధికారిని చేస్తూ ఇచ్చిన ఫర్మానా! కసిగా చించి ముక్కలు చేశాడు. ఆ వెంటనే గొంతు పట్టుకుని గిలగిలలాడుతూ నేలకొరిగాడు..**


పట్టుకున్నాడు.

తమ నాయకుణ్ని ఒక పక్కకు లాగి, గోడ ఆసరాగా కూర్చుండబెట్టాడు. లోనికి వచ్చే శత్రుమూకలను ఎదుర్కోవాలి, సమయం లేదు. ముందుగా రాజుగారికి వర్తమానం పంపించాలి. వార్తాహరుణ్ని ఉరికించాడు.. రాజమహల్ దగ్గరికి. కబురందించమని. తాను ముందుకురికినాడు.. శత్రువులను నిలవరించడానికి.. 'జై రంగనాథా!' అని నినదిస్తూ.

చిన తిమ్మానాయుడు ఖిన్నవదనుడై విన్నాడు వార్త. తన బావమరిది ఇక లేడు. ఆ సమయంలో ఆయన ఆసనం పక్కనే నిలబడి ఉన్నారు ఇద్దరూ.. రాణి చిన్నమ్మ, చెల్లెలు పెమ్మసాని గోవిందమ్మ. గోవిందమ్మ వంక జూశాడు. ఆమె కళ్లల్లో నీళ్లు కారిపోతున్నవి.. సెలయేరుల్లాగ. కానీ, ఆమె చిత్రంగా తన కళ్ల నీళ్లు పైటకొంగుతో తుడుచుకుంది.

''నే వెళ్తున్నానన్నా!'' అన్నది క్లుప్తంగా.

దిమ్మెరపోయి నాయుడన్నాడు..

''ఎక్కడికి చెల్లెమ్మా?''.

ఒకపక్క పక్కగదిలో స్త్రీలంతా ఘొల్లున ఏడుస్తున్నారు.. భర్త లేని జీవితం వృథా అని, శత్రువునించి మాన ప్రాణాలు కాపాడుకోడానికి చితిపేర్చుకు దుమికేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక నిమిషం వారి రోదనలు ఆలకిస్తూ అన్నది గోవిందమ్మ..

''నా భర్తను చంపినోణ్ని వెంట తీసుకుపోకుండా నేనెట్ల పోతానన్నా?''.

తిమ్మానాయుడు ఎంత వారిస్తున్నా వినక చీర బిగించి కట్టి, కాసెగట్టింది గోవిందమ్మ. ఒక వంద మంది సైనికులను తనవెంట రమ్మన్నది.

అశ్వమెక్కి కత్తి చేతబట్టింది..

''అబ్దుల్ నబీ అట.. వాడెక్కడున్నాడో జాడ తియ్యండి!'' అంటూనే గుర్రాన్ని ముందుకు ఉరికించింది.

రణం సాగుతూనే ఉన్నది. కోట అంతటా శత్రువులు వ్యాపించి ఉన్నారు. తనకు అడ్డువచ్చిన వారిని వేటువెయ్యమని తనవారిని ఆజ్ఞాపిస్తూ.. తాను తప్పించుకుంటూ అందిన వానిని వేటువేస్తూ వదలకుండా వేటాడింది వానికోసం. చివరికి దొరికినాడు.. ఆ నబీ అనేవాడు.

''అరేయ్ నబీ!'' అని ఆమె పెట్టిన పెడబొబ్బకు వాడు నివ్వెరపడి ఒకక్షణం నిలిచిపోయినాడు.

అదే అదనుగా ఆమె కత్తి ఎత్తింది. వాని గుండెల్లో గుచ్చింది. వాడు తేరుకుని ఆమెను ఒక్క పోటుపొడిచి తాను గిలగిలా తన్నుకుంటూ ప్రాణాలు వదిలినాడు. గోవిందమ్మ గుర్రంపైనించి తూలిపడి నేలకు జారింది. ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయినాయి.

* * *

గుర్రమెక్కి రణరంగంలో కదను తొక్కుతున్న చిన తిమ్మానాయుడు.. చెల్లెలి మరణ వార్త విని నిశ్చేష్టుడైనాడు. చుట్టూ చూస్తే శవాల గుట్టలు, మనసంతా వికలమయింది. సంధికి రమ్మని పొదిలి లింగన్న కబురంపితే తప్పనిసరై ఒప్పుకొన్నాడు.

'జరిగిన రక్తపాతం చాలు. అయినవాళ్లంతా మరణించారు.. ఇంకా ఏం బావుకుందామని?'.. అయితే, మనసు హెచ్చరించింది. తన రాజ కుటుంబీకులను, అనుచరులను సంప్రదించాడు. లింగన్న మాటలు నీటి మూటలు. ఐదేళ్ల తన వారసుడు, కొడుకు పిన్నయనాయుడిని రహస్యమార్గం గుండా కోట దాటించేలా ఏర్పాటుచేసి, మిగతా బంధువులను తరలి వెళ్లిపొమ్మని అప్పుడు బయల్దేరాడు.. సంధి ప్రయత్నాలకు.

మాయ మాటలు మాట్లాడుతూ పొదిలి లింగన్న చేతికి అందించిన విష పానీయం నమ్మికతో అందుకున్నాడు తిమ్మానాయుడు. మరోపక్క తన చేతిలో ఉంచిన ఫర్మానా చూసి నివ్వెరపోయినాడు. గుత్తి దుర్గానికి బదులుగా ఒక చిన్న గ్రామం హనుమనగుత్తికి అధికారిని చేస్తూ ఇచ్చిన ఫర్మానా! కసిగా చించి ముక్కలు చేశాడు. ఆ వెంటనే గొంతు పట్టుకుని గిలగిలలాడుతూ నేలకొరిగాడు..

''రంగనాథా.. కాపాడు నా ప్రజలని, నా కోటని!'' అని ప్రార్థిస్తూ, తుదిశ్వాస విడిచాడు.

తనువు కోట నేలను ముద్దాడింది. రాజులేని గండికోట బావురుమన్నది.

వీరుల పుట్టిల్లు గండికోట పతనం పూర్తయింది. కోట సంపదను పూర్తిగా కొల్లగొట్టాడు మీర్ జుమ్లా. మాధవ ఆలయాన్ని ధ్వంసం చేసి అక్కడ ఒక ప్రార్థనా మందిరాన్ని కట్టించినాడు.

***

గండికోట పతనమైన ఎనిమిది రోజులకు ప్రముఖ వజ్రాల వ్యాపారి టావెర్నియర్ గండికోటలో మీర్ జుమ్లాను కలిసి ఉండకపోతే.. ఆ సందర్భంలో చిన తిమ్మానాయుని శౌర్య పరాక్రమాల గురించి విని తన పుస్తకంలో నమోదుచేసి ఉండకపోతే.. కోటను కాపాడటానికి చేసిన ఈ వీరోచిత పోరు మనదాకా రాకపోయేది. గండికోట సగర్వంగా నేటికీ తలెత్తుకు నిలిచే ఉంది.. చరిత్రకు నిలువెత్తు సాక్షిగా. కలం అందుకొమ్మని, ఛాయా మాత్రంగా ఉన్న తన చరిత్ర ఆఖరి అధ్యాయాన్ని కథగా, ఒక గాథగా మలచమని పిలుపునిస్తున్నట్టుగా ఉంది. ఆ పిలుపునకు స్పందనగా ఒక చిన్న యత్నం.. ఈ గండికోట పతనం! ■

## తెన్నేటి శ్యామకృష్ణ



చారిత్రక నేపథ్యంలో మరిన్ని కథలు రాయాలన్నది తన కోరికగా చెబుతున్నారు రచయిత తెన్నేటి శ్యామకృష్ణ. ఈయన తల్లిదండ్రులు అహల్యాదేవి – టీవీ సుబ్బారావు. స్వస్థలం వరంగల్. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఎంఏ, ఆంగ్లంలో డాక్టరేట్ చేశారు. జూనియర్ లెక్చరర్‌గా విరమణ పొందారు. చదువుకునే రోజుల నుంచే పిల్లల పత్రికలకు కథలు రాయడంతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. బాలమిత్రలో కథకు బహుమతి లభించింది. ఆ తర్వాత పిల్లలకోసం నాటికలు రాసి ప్రదర్శించారు. ప్రశంసలూ అందుకున్నారు. ఈ నాటికలను పుస్తకంగా తీసుకురానున్నారు. ఈయన రాసిన పలు కథలు ప్రముఖ తెలుగు పత్రికలతోపాటు ఈ రచన పత్రిక, నెచ్చెలి స్త్రీల పత్రికలో ప్రచురితమయ్యాయి. సాహితీ కిరణం, 'సాక్షి ఫన్‌డే'లో కవితలు వచ్చాయి. వివిధ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో దేవుడు వెలిశాడు, మాబడి మర్రిచెట్టు నీడన తదితర కథలు బహుమతులు దక్కించుకున్నాయి. వంశీ ఆర్ట్స్ సంస్థ ఏటా ప్రచురించే 'కొత్త కథలు' కథా సంకలనంలో నాలుగు కథలు ప్రచురితమయ్యాయి.